అనామకుడు

శ్రీ చంద్రమౌళి

అయ్యో—అయ్యో—అయ్యో' అని, అటు మిన్ను విరిగి మీద పడ్డట్లూ, ఇటు పాదాలకింద నేల కుంగిపోయినట్లూ, హాహాకారాలు గాలిలో తేలినై. ఆడవాళ్ల గొంతులూ మొగవాళ్ల గొంతులూ అటు ఆకాశాన్ని చేరకముందే—ఇటు నేలను తాకకముందే—చుక్క రాలిపడ్డట్టు నేల రాలినకాంక్రీటు బొచ్చెతోబాటు నేల రాలాడు అతడు. ఇంకా హాహాకారాలు నింగికీ, నేలకూ మధ్యవర్తులులా చుడుతూనే ఉన్నై. ఆడవాళ్ల గొంతులూ, మొగవాళ్ల గొంతులూ—గమ్యం లేనట్లు గాలిలో తేలుతూనే ఉన్నై.

అయినా ఒక్కసారి సృష్టి స్థంభించిపోయింది. గరగరలాడుతూ తిరుగుతున్న కాంక్రీటు మిక్సర్' ఆగిపోయింది. ప్రతిసృష్టి చేయటానికి, ప్రకృతికన్న వేగంగా పరుగెత్తి బారులు తీరుస్తున్న కాంక్రీటు బొచ్చెల గొలుసు తెగిపోయింది. ఎక్కడి బొచ్చె లక్కడే ఆగిపోయినై. ఎక్కడి కదలిక అక్కడే—అరక్షణం తొందరపడితే—ఎన్ని బొచ్చెలు నేల కూలేవో—? ఎంతటి వికృతి జరిగేదో—?

ప్రక్కనే నింగిని కలుసుకోవటానికి సంబరపడుతున్న విశ్వామిత్ర సృష్టి అప్పటిదాకా జీవంతో కలకల్లాడుతూ సగం పూర్తయిన మూడంతస్థుల మేడ ఎక్కడో జరిగిన తప్పుకు చలనం పోగొట్టుకున్నట్టయింది. జీవానికి ప్రతినిధులు ఎన్నో కళ్లు—అంతమటుకు నింగినే చూస్తున్నవి నేలకు దిగినై. ఎక్కడో జరిగింది తప్పు. ముక్కూ చెవులూ తెగి అందవిహీనురాలైన శూర్పణఖలా రిక్కవడి చూస్తున్నది. విశ్వామిత్ర సృష్టి. ఎక్కడో జరిగిన తప్పుకు ఎవరో కారణభూతులు—? ఎవరైతేనేం, అతను మటుకు నేల కూలాడు. రిక్క నేల కూలింది. సముద్రంలో పెనుతుఫాను రేగింది.

కింద కాంక్రీటును నుగ్గు నుగ్గు చేయ చూస్తున్న మిక్సరులోని చక్రం ఆగిపోయింది. నేలమీద ఇనుపరేకు మీద చెల్లా చెదురుగా ఉన్న కాంక్రీటును—రోడ్డుమీద వెదజల్లిన రూపాయిలను గుప్పిటలో చిక్కించుకోవాలని సర్వ ప్రయత్నాలు చేసే చేయిలా—చే జిక్కించుకుంటున్న పార ఆగిపోయింది. దానిలో జీవం కలుగజేసిన చేతుల్లో ఇప్పుడు నెత్తురు పారటంలేదు. నోరు తెరుచుకుని చూస్తున్న ఇనుపబొచ్చె నోరు తెరుచుకునే ఉన్నది. అందుకోవటానికి జాచిన కూలీ చేతిలో జీవం ఒక్కసారి స్థంభించినట్లయింది. అంచ లంచలుగా ఆకాశాన్ని అందుకోవటానికి సాయం చేస్తున్న కూలీలలో సైతం నెత్తురుగడ్డకట్టుకు పోయినట్లయింది. చేతుల్లో బరువుతో నిండిన బొచ్చెలు—ఎక్కడి వక్కడే ఉన్నై. ఆ చేతులు అంతసేపు ఆ బరువు ఎలా మోస్తున్నాయో వాళ్లకే ఆశ్చర్యం కలిగించింది.

యాత్రకు పోతున్న ప్రయాణికుల్లా ఒకరి వెనుక ఒకరు తిరణాలలో జయింటు వీలులో ఒకరిపైన ఒకరుగా—కూలీలు వెదురు బొంగులతో కట్టిన పరమపద సోపానాలమీద నిల్చున్నట్లు నిల్చున్నారు. కళ్లు తేలవేసి చేతులు బిగిసిపోయి—ఆలోచనలు స్థంభించిపోయి—నిల్చున్నారు. పైన మూడో అంతస్థుమీద శ్లాబు వేయిస్తున్న మేస్త్రీ ఒక్కసారి తెల్లబోయాడు. ఏమిటీ ప్రతిష్టంభన అని—క్రిందకు ఒక్కసారి చూచాడో లేదో—

అందరి మనస్సుల్లోనూ ఒక్కసారి భయం. కారు చీకటిలాటి భయం. ఏదో తెలీని భయం. ఏదో తెలిసీ తెలీని భయం. ఎక్కడా సంచలనం లేదు—" అయ్యో—అమ్మో—' తప్పించి—ప్రాణంలేని మరలు సైతం ఆగిపోయినై. కాని, అందరి హృదయాల్లోను ఒక్కసారి వెయ్యి హార్సు పవర్ల బలంతో, నడుస్తున్న మరలు చేస్తున్నయ్ చప్పుడు.

పైనుంచి మేస్త్రీ ఒక్క పొలికేక పెట్టాడు. తుపాకి గుండుకు రాలిన పక్షుల్లా అంతకు ముందరి తమ అస్థిత్వాన్ని మరచి—అంతకు ముందరి బ్రతుకుమీది తీపి వదిలి—అంతకు ముందరి—చీకటిలాటి భయం పోయి—అంతకుముందు—మనస్సుల్లో—చీకటి కొట్లలో దాచుకుని—తేపతేపకూ ఉందో లేదో అని తడివి చూసుకుంటూ వచ్చిన స్వార్థాన్ని ఒక్క

క్షణం మరచిపోయి—కూలీ లందరూ ఒక్కరొక్కరుగా క్రిందికి దిగిపోయారు. అంతమటుకూ షష్ఠిపూర్తి చేసుకున్న మహాకవిలాగా—ఒక లక్ష పోతే పోయె—ఎలక్షన్లలో గెలివానని తెలిసిన ఎం. ఎల్. ఏ. లాగా వెలుగుతున్న సగం పూర్తయిన మూడంతస్థుల మేడా వెలవెల పోయింది.

అప్పటికే అతని చుట్టూ జనం చేరారు. వాళ్ల హృదయాలు ఎప్పుడూ అనుభూతి పొందని సానుభూతిని అనుభవిస్తున్నై.

చిరుగులతో అతని వళ్లు కప్పుతున్న బనీనూ—మోకాళ్లు దిగని పంచా—వయసు మిసిమిని మరీ కొట్టవచ్చినట్లు చూపిస్తున్నై. తలవారికలై—నెత్తురు సెలయేరులా కారసాగింది. ఎవరో గుడ్డ తెచ్చి నెత్తురు తుడుసున్నారు. హడావుడిగా వచ్చిన పోలీసులు శవం సంగతి మరచిపోయి జనం సంగతి చూస్తున్నారు.

మేస్త్రీని వాళ్లూ వీళ్లూ సవాలక్ష ప్రశ్నలు వేస్తున్నారు. అతని చూపు కానీ—అతని మనస్సు కానీ అక్కడ లేవు. "బలి కోరింది బాబోయ్ యీ బిల్డింగు" అంటున్నా డొక కూలీ. సగం లేచిన బిల్డింగు పైనున్న కూలీ కూడా కిందకు దిగి వచ్చాడు. ఆ బిల్డింగు పక్కనే రెక్కలు విప్పుకునున్న చెట్టుమీది గూళ్లకు పక్షులు జేరుతున్నై. పడమటిదిశ ఎర్రబారింది. గాలి—ఎక్కడి దక్కడ ఆగిపోయి సానుభూతి చూపిస్తున్నది. సున్నం గానుగ చుట్టూ, మనిషి లేకపోయినా దున్న గానుగాడుతున్నది. చుట్టూ సిమెంటు వాసన—ఎండిన దుమ్ములో నీళ్లు పడ్డప్పటి వాసన—కాంక్రీటు వాసన—మనషుల చెమట వాసన—పోలీసు దగ్గర లంచం వాసన. "ఏయ్ మేస్త్రీ ఇట్లా రా"—అంటున్నాడు పోలీసు. లోకానికి విడాకులిచ్చిన ఎవరో ఆసామీ ఇక్కడ ఇంతమంది ఎందుకు గుమిగూడారా అన్న ధ్యాసే లేకుండా—హారను మోగిస్తూ కారులో దూసుకుపోయాడు. ఆయన మనసులో ఉక్కిరిబిక్కిరౌతున్న భావాల వత్తిడికి కారు టైర్లు మేఘాల్ని సృష్టించినై. ఎందుకీ పనికిరాని ఆ దుమ్ముక్కూడా ఆకాశాన్నంటే ఆశ.

పోలీసు మేస్త్రీని పక్కకు లాక్కెళ్లుతున్నాడు. "ఎవరు—ఎవరు ?" అంటున్నాడు అప్పుడే గుంపులో జేరి, తను వాళ్లకన్న గొప్పవాడిననే 'యిగో' ను క్షణంపాటు జేబులో వేసుకున్న పెద్దింటి పెద్దమనిషి. "కూలీ"— అని సమాధానం— "ఏమైంది ? ఏమైంది ?" అంటున్నా రింకొకరు. "పైనించి పడ్డాడు—" అని సమాధానం. "పాపం—ఇంకా అలా చూస్తారేమయ్యా ఆస్పత్రికి తీసుకెళ్లక—" అంటున్నాడు ఉడుకు రక్తం ఉరకలేస్తున్న కుర్రాడు. "ఆస్పత్రి—ఆస్పత్రి" అందరి గొంతుల్లోనూ అదే ధ్వని—ఆ ధ్వనికి ప్రతిధ్వని—కావలసిన పోలీసు ఏడంచెయ్యి—నిక్కరు జేబులోంచి అప్పుడే బయట పడింది.

ఒకళ్లు టాక్సీ కోసం పరుగెత్తారు. ఒకళ్లు—రిక్షాని పిలిచారు. దారిలో పోతున్న ఎవరిదో కారును ఆపుతున్నారు ఇంకొకరు. టాక్సీ వచ్చింది, రిక్షా వచ్చింది. దారిన పోతున్న కారూ ఆగింది. "టాక్సీలో పడుకోబెట్టండి" అంటున్నాడు—టాక్సీ తెచ్చినాయన. "రిక్షాలో పడుకోబెట్టండి" అంటున్నాడు రిక్షా తెచ్చినతను—కారు ఆసామి కారు దిగి—"అరె—పాపం—ఇంకా ఆలస్యం చేస్తారే—కారులో వెనకసీట్లో పడుకోబెట్టండి" అంటున్నాడు. తోటి కూలీలు నలుగురూ—చేతులేసి 'అతన్ని' లేవదీశారు. గాలికి నెత్తురు గడ్డకట్టిపోయింది. కారినంత లెక్క నల్లని జుత్తు ఎర్రబడింది. పళ్లు—ఒకటో రెండో విరిగి నెత్తురు బుగ్గలయింది. బుగ్గ వాచిపోయింది. తనమీద ఇంతమందికి—ఒక్కసారి—బోలెడు సానుభూతి కలిగిందని గ్రహించటాని కతనికి స్పృహలేదు.—'డబ్బుఖర్చు కాదని' కారులోనే పడుకోబెట్టా రతన్ని. పోలీసులు కొలతలు కొలవడం అప్పటికి పూర్తయింది. ఇద్దరు పోలీసులూ— 'అతని'తోబాటు కారులోఎక్కారు. ఒకలిద్దరు కూలీలు ఎక్కారు. మేస్త్రీ వెనక దిగడ్డాడు. అప్పుడే వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టర్ దొరికావులే కొండిగా అన్నట్లు మేస్త్రీ వంక చూచి—ఏవేవో ప్రశ్నలు వేస్తున్నాడు.

"నీపే రేమిటి ?" "నీ ఊరేమిటి" లాటివి. ఆఖరుకు అసలు విషయానికి వచ్చాడు. మేస్త్రీ మనసులో అతనే మయ్యాడోననే ఆదుర్దా. "ఇన్ని ప్రశ్నలేసే బదులు ఆ కావల్సిందేదో చెప్పరాదూ ?" అంటున్నాడు, డబ్బు సంపాదించటంలోనే కాక ఖర్చు పెట్టటంలో కూడా 'సుళువులు' నేర్చుకున్న మేస్త్రీ. ఇన్‌స్పెక్టరు నవ్వాడు. ఆ నవ్వు విలువ పాతిక అని వ్యాఖ్యానించాడు మిగిలిపోయిన పోలీసు. తీరా తీర్థానికి తీర్థం—ప్రసాదానికి ప్రసాదం అన్న సామెత గబుక్కున జ్ఞాపకానికొచ్చి—ముడుపు చెల్లించుకున్నవాడు—వందనాలు పొందవలసింది పోయి—పెట్టి తప్పుకున్నాడు. తప్పుకుని ఏకబిగి ఆస్పత్రికి బయలుదేరాడు. డబ్బు పోతే పోయె శని విరగడైందని.

రిక్షాలో కూర్చున్న తరువాత ఆత్మజ్ఞానం కలిగింది. తన ఎరికలో ఇలాటి వ్యవహారంలో చిక్కుకోవటం ఇదే మొదటిసారి. తన మూలంగా ఎన్నో ప్రాణులు సుఖాన పడ్డాయ్ కాని— కష్టంలో ఇరుక్కుంది ఇదే మొదటిసారి. అతన్ని తలుచుకుని జాలివేసింది. రిక్షా నాలుగడుగులు వేసిందో లేదో

వెనక నుంచి పోలీసు సైకిలు మీద తరుముకొచ్చాడు— "ఆడి పేరేటి ?" అన్నాడు— "ఎవడి పేరు ?" అన్నాడు మేస్త్రీ బొమలు ముడివేస్తూ— "ఆడే—పైనించి పడ్డాడే ఆడిపేరు ఇనస్పెక్టర్‌గారు రాసుకోలేదంట" అన్నాడు. "కనుక్కొని చెబుతాలే" అన్నాడు మేస్త్రీ వెటకారంగా రిక్షా జారిపోయింది.

మేస్త్రీ ఆస్పత్రికి జేరి రిక్షా దిగేటప్పటికి చిన్న మేస్త్రీ ఎదురొచ్చి "ఆడి పేరేమిటి ?" అన్నాడు. మేస్త్రీకి చిరాకేసుకొచ్చింది— "ఎవడిపేరు ?" అన్నాడు. "వాడే— ఆ పోయినాడి పేరు—" "పోయినాడా— అంటే— ఆ కూలీ నాయాల చచ్చిపోయాడా ఏమిటి ?" అన్నాడు. మాట తొస్సుమని వచ్చినా మేస్త్రీ గుండెల్లో దడ— "మరేంటి— ఎవరి నడిగినా ఆడిపేరు తెలీదన్నారు— నీకు తెలుసేమోనని డాక్టరుగారు కనుక్కోమన్నారు— నీకూ తెలీదూ ?"

"పనిలోకి తీసుకుంది నువ్వేగా— నీకే తెలియాలి నాకేం తెలుసు" అన్నాడు మేస్త్రీ. చిన్నమేస్త్రీ తెల్లబోయి నీళ్ళు నమిలాడు. "ఆడి పేరేంటి— ఆడి పేరేంటి" అని కనబడ్డ కూలీనల్లా అడిగాడు.

అందరూ బిక్క మొగమేశారు. "మేస్త్రీని డాక్టరుగారు పిలుస్తున్నా"రన్నా రెవరో. మేస్త్రీ లోనికెళ్ళాడు. "పొద్దున్నే శవాన్ని అయినవాళ్ళ కిస్తారుట." అన్నాడు తాపీ పని చేసే రామిరెడ్డి." ఆడి పేరే తెలీంది— అయిన వాళ్ళెవరని ?" అన్నాడు కాంక్రీటు మిక్చరు నడిపే ఎసోబు. "అయినా వాళ్లెవరూ లేకపోతే ఆళ్లే తగలేత్తారు". ఆడు హిందువై తేగా" అన్నాడు పీరు సాయిబు— "కాకేమిటి— ఆడ్ని చూస్తే తెలీటల్లా" అన్నాడు రామిరెడ్డి—" ఏమో ? అన్నాడు ఎసోబు—" నలుగురు కూలీలూ పోగైనారు. ఎవరికి తోచిన అభిప్రాయం వాళ్ళు చెబుతున్నారు. ఒకళ్లు హిందు వంటే ఒకళ్లు— సాయిబంటున్నారు. ఎసోబు నవ్వి— 'కాదు'— అన్నట్లు చూస్తున్నాడు. అందరూ ఒక్కసారి ఆస్పత్రిలోకి వెళ్లారు. బెడ్‌మీద— అనామకుడైన వ్యక్తి శవం పడున్నది. డాక్టరు కూలీలందరినీ వెళ్ళి పొమ్మని గదమాయించాడు. అందరూ బయటి కొచ్చారు.

తెల్లవారింది. జీవం కోల్పోయిన మూడంతస్థుల మేడ మళ్లీ జీవం పోసుకుంటున్నది. సృష్టికి ప్రతిసృష్టి జరుగుతున్నది. కాని అందరి మనసుల్లోనూ నిన్నటి రోజున జరిగిన సంఘటనే మెదులుతున్నది. ఇవాళ పనిలోకి అంత మంది కూలీలు రాలేదు. ఈ మేడ బలికోరిందని— జడిశారో ఏమో— సూర్యుడు నడినెత్తికొచ్చాడు. అప్పటికి చిన్నమేస్త్రీ తిరిగి వచ్చాడు.

కూలీలు బువ్వకు దిగారు. అందరి మనసుల్లోనూ ఒకే ఆలోచన— ఆడిశవాన్ని కాల్చారా— పాతి పెట్టారా— అని. చిన్న మేస్త్రీ— వచ్చి సవాలక్ష ప్రశ్న లేస్తున్నాడు. తాపీ పని రామిరెడ్డి — ధైర్యం చేసి ముందడుగేసి అడగనే అడిగాడు— చిన్న మేస్త్రీ ఇసుక్కుని— "పొదా చచ్చినాడికి మతమేంటి—" అన్నాడు—